క్లుప్తంగా

'మాగంటి' మరణం తీరనిలోటు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గోపీనాథ్ మూడు పర్యాయాలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. వివాద రహితుడిగా, సౌమ్యుడిగా నిరంతరం ప్రజల్లోనే ఉంటు ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. తనకు ఆయనతో చాలా అనుభందం ఉందని, ఆయన మృతిపై వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఆపదలో 'విధాత' ఆసరా



ఆర్థిక సహాయం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొండపాక(గజ్వేల్): ఆపద సమయాల్లో విధాత పొదుపు సంఘం ఆసరాగా నిలుస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు ఊడెం తిరుపతిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గలో ఆదివారం పొదుపు సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం నిర్వహణ, డబ్బుల ఖర్చుల విషయాలపై చర్చించారు. ఇటీవల సంఘం సభ్యుడు జంగపల్లి నర్సింహులు మృతి చెందగా అతడి భార్య లక్ష్మికి ఆదివారం రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో హరినాథశర్మ, శ్రీనివాస్, రవీందర్, మల్లేశం, యాదగిరి, రాజయ్య, షౌకత్‌అలీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

క్యూబాకు సంఘీభావ నిధి



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

దుబ్బాక: సీపీఎం ఆధ్వర్యంలో క్యూబా దేశానికి సంఘీభావంగా సీపీఎం నేతలు విరాళాలు సేకరించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ అగ్రరాజ్యం అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలతో 65 యేళ్లుగా క్యూబా నలిగిపోతుందన్నారు. క్యూబాలో ప్రజలు దుర్భరంగా జీవనం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో వారికి అండగా నిలుద్దామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సాజిద్, మల్లేశం, లక్ష్మీనర్సయ్య, రాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ సన్నిధిలో ఐఈఎస్ అధికారి మనీష



మనీషను సన్మానిస్తున్న పూజారి

హుస్నాబాద్: జాతర సందర్భంగా ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)అధికారి పూదరి మనీష, మనోజ్ దేవేందర్‌గౌడ్ దంపతులు ఆదివారం ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. వారికి పూజారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టణానికి చెందిన మనీష ప్రస్తుతం సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వేస్‌లో డీఎస్‌టీఈగా విధులు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

విరాళాల కౌంటర్ ప్రారంభం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఈఓ అన్నపూర్ణ

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల నుంచి విరాళాలు సేకరించేందుకు విరాళాలు స్వీకరించే కౌంటర్‌ను ఆదివారం ఈఓ అన్నపూర్ణ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భక్తులు ప్రత్యేక కౌంటర్‌లో విరాళాలను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, శ్రీరాములు, సురేందర్ రెడ్డి, ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్

తెల్లవారుజాము నుంచే రేషన్‌షాపుల వద్ద క్యూ

- గంటల తరబడి బియ్యం కోసం పడిగాపులు
- ఆరుసార్లు వేలిముద్రలతో సర్వర్ సమస్య
- ఆందోళనలో కార్డుదారులు
- 3 నెలలకుగాను జిల్లాకు 18,826 మెట్రిక్‌టన్నుల బియ్యం



బియ్యం కోసం వచ్చి కూర్చున్న వృద్ధురాలు ఈశ్వరమ్మ

దుబ్బాక: ఈ ఫోటోలో కనిపిస్తుంది దుబ్బాకకు చెందిన 86 యేళ్ల వృద్ధురాలు ఈశ్వరమ్మ. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో నాలుగు రోజుల క్రితం రాగా మంది ఎక్కువ ఉండి తన వంతు రాకపోవడంతో ఇంటికి పోయింది. అయిపోతాయనే భయంతో మళ్లీ శనివారం తెల్లవారుజామునే ఆరు గంటలకే రేషన్ దుకాణం వద్దకు వచ్చింది. అప్పటికే అక్కడ చాలా మంది ఉండటంతో తానుకూడా లైన్‌లో కూర్చుంది. తీరా 8 గంటలకు రేషన్ డీలర్ వచ్చి దుకాణం తెరచి పంపిణీ ప్రారంభించాడు. ఇక పది గంటలు దాటుతున్నా తన వంతు రాకపోవడంతో రోడ్డుపైన కూలబడింది. ఆమెను సాక్షి పలుకరించగా 5 రోజుల క్రితం వచ్చిన.. ఆనాడు రాకపోవడంతో ఇంటికి పోయిన మళ్లీ ఇయ్యాల 6 గంటలకే వచ్చిన.. ఇప్పటికే 3 గంటలాయే.. ఎప్పుడు ఇస్తరో.. ఏమో అంటు నిస్సహాయంగా చెప్పింది. ఇది ఒక్క ఈశ్వరమ్మ బాధనే కాదు జిల్లాలో చాలా మంది రేషన్ బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు.

తెల్లవారక ముందే బారులు

ప్రభుత్వం వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని 3 నెలల బియ్యం ఒకేసారి ఇవ్వాలని జూన్ 1న శ్రీకారం చుట్టింది. దీంతో ప్రజలు తెల్లవారక ముందే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల వద్ద ఇదే పరిస్థితి. ఉదయం 8 గంటలకు డీలర్లు షాపులు తెరిచి బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్నారు. ఒక్కో వినియోగదారుడికి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి ఉండడంతో అరగంటకు పైగా సమయం పడుతోంది. దీంతో గంటలో కేవలం ఇద్దరికి మాత్రమే బియ్యం అందుతున్నాయి.

సర్వర్ సమస్యతో ఇబ్బందులు

ఆరు సార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి రావడంతో.. ఈపీఓఎస్ యంత్రాల సర్వర్ తరచూ మొరాయిస్తుంది. దీంతో వేలిముద్రలు పడక, తూకం కాంటాలు ఆగిపోతుండడంతో రేషన్‌డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం కోసం వచ్చిన వారు సైతం గంటల తరబడి ఉంటున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి వేలిముద్రలు తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, డీలర్లు అంటున్నారు.

జిల్లాకు 18,826 మెట్రిక్ టన్నులు

జూన్, జులై, ఆగష్టుకుగాను జిల్లాకు మొత్తం 18,826 మెట్రిక్ టన్నుల బియ్యంను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలో 686 రేషన్ షాపుల ద్వారా 2,98,985 కార్డులుండగా ఇందులో మొత్తం 9,58,598 మంది సభ్యులకు ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఇవ్వనున్నారు.

అయిపోతాయనే భయం

బియ్యం అయిపోతాయనే భయంతోనే ప్రజలు ముందుగా వచ్చి బారులు తీరుతున్నారు. నెలరోజుల పాటు ఇస్తారని తెలియకనే తెల్లవారకముందే దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. అయితే అందరికీ అందుతాయని అధికారులు చెప్తున్నారు.



దుకాణం తెరవక ముందే క్యూ లైన్‌లో ప్రజల పడిగాపులు

బియ్యం అందరికీ అందుతాయి..



రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న మూడు నెలలకు సంబంధించిన బియ్యం అందరికీ అందుతాయి. 18,826 మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ షాపులకు అందించారు. కార్డుదారులందరికీ బియ్యం వస్తాయి. ఎవరూ ఆందోళన చెందవద్దు.

– తనూజ, డీఎస్‌ఓ

ఒక్కసారే వేలి ముద్రలు తీసుకోవాలి



మూడు నెలల రేషన్ బియ్యం కోసం ప్రజలు గంటల తరబడి రేషన్‌షాపుల వద్ద పడిగాపులు పడుతుండ్రు. ఒక్కొక్కరి నుంచి ఆరు సార్లు వేలిముద్రలు తీసుకుంటుండడంతో సర్వర్ సమస్య వస్తోంది. దీంతో గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. ఒకేసారి వేలిముద్రలు తీసుకునేలా సవరణ చేసి ఇబ్బందులు తొలగించాలి.

– భాస్కర్, సీఐటీయూ జిల్లా నాయకుడు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



నూతన పాలక వర్గాన్ని సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఏ మల్లయ్య

దుబ్బాకటౌన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ఆదివారం నిర్వహించిన ఆత్మ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దుబ్బాక డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్‌గా గాంధారి నరేందర్ రెడ్డితోపాటు మరో 23 మంది కమిటీ డైరెక్టర్లను దుబ్బాక వ్యవసాయశాఖ ఏడీఏ మల్లయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని, రైతుల సంక్షేమం కోసం ఆత్మ కమిటీలు చొరవ చూపాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఏఓ ప్రవీణ్, మండల అధ్యక్షుడు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మైత్రీవనం ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేఆర్‌చౌరస్తా, మైత్రీవనం, వినాయకనగర్, మారుతీనగర్, రాజేంద్రనగర్, కాకతీయనగర్, ఆదర్శనగర్, మహాశక్తినగర్, విఘ్నేశ్వరనగర్ ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

చిన్నకోడూరు పరిధిలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మ్మర్లపల్లి, అల్లీపూర్, మాచాపూర్, విఠలాపూర్, నారాయణరావుపేట మండలంలోని జక్కాపూర్ గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ చాంద్ పాషా తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి శివారులోని తాళ్ల కుంట ప్రాంతం నుంచి కొంత మంది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా పదుల సంఖ్యలో టిప్పర్ల సాయంతో మట్టిని వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివారం స్థానికులు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ దివ్యను వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయాలేదని తెలిపారు.

సింహద్వార పనులకు శ్రీకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో సింహద్వార పనులను పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్నా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశం, అశోక్, శ్రీహరి, రవితేజ, ఆంజనేయులు, శ్రీనివాస్, మహేశ్, రాజేంద్రప్రసాద్, సంతోష్ కుమార్, నగేశ్, నాగరాజు, జలజ, సునీత తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న 1989-1990 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



తొగుట(దుబ్బాక): ఎల్లారెడ్డిపేటలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో 1989–1990 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వాళ్లంతా కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ భవిష్యత్‌కు పునాది వేసిన గురువులు నారాయణ, ఇంద్రసేనారెడ్డి, మానయ్య, శంకరయ్యను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు.

1995–96 బ్యాచ్..

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా కలుసుకున్నారు. పాఠశాలలో సరదాగా గడిపారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.



చిన్నకోడూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఎల్లారెడ్డిపేటలో..

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా 20 యేళ్ల తర్వాత కలుసుకుని సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మోతెలో చౌడాలమ్మ కల్యాణంలో పాల్గొన్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మిరుదొడ్డిలో ఆదివారం జరిగిన బొడ్రాయి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు సామూహిక జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామదేవత ఉత్సవాలను పల్లెల్లో అన్ని వర్గాల వారు ఏకతాటిపై నిర్వహించడం శుభపరిణామమన్నారు. అనంతరం అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన చౌడాలమ్మ విగ్రహప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవంలో వెంకటయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు రంజిత్, రాజేశ్వర్, కైలాస్ చంద్రం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ మృతి బాధాకరం

దుబ్బాక: దుబ్బాక మండలం గంబీర్‌పూర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది బాపూరావు మాతృమూర్తి లక్ష్మమ్మ మృతి విషయం తెలుసుకున్న వెంకటయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట కైలాసం, శ్రీనివాసు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

'కాళేశ్వరం'లో బీఆర్‌ఎస్ నాయకుల అవినీతి

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల అవినీతి ఉందని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీఆర్ఎస్ నాయకులకు భయం పట్టుకుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కమిషన్ వేయడంతో అందులో పాలు పంచుకున్న అవినీతిపరులు ఆందోళన పడుతున్నారని ఎద్దేవా చేశారు. అవినీతికి పాల్పడ్డ నాయకులు, అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈటల రాజేందర్, హరీశ్ రావుల చీకటి భేటీపై ప్రజలకు వివరించాలని, ప్రాజెక్టు డిజైన్ మార్చి లక్షల కోట్లు రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం వేశారని వాపోయారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మధు, యువజన పట్టణ అధ్యక్షుడు గయాజొద్దీన్, మైనార్టీ నాయకులు సలీం, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న లింగమూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇల్లులేని ప్రతి పేదవాడికీ ఇల్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేటతోపాటు గౌరవెల్లి, జనగామ, కట్కూర్ గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే దాదాపు 357 ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మొదటి విడత కింద నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇచ్చారని, త్వరలో రెండో విడత కింద 3 వేల ఇళ్లు ఇచ్చేందుకు మంత్రి పొన్నం కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఐల్లయ్య, ప్రభాకర్, రమేశ్, పరశురాములు, దామోదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే వినూత్న పథకాలు

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీకాంత్



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

దుబ్బాకటౌన్: రైతుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం వినూత్న పథకాలు చేపడుతోందని మెదక్ కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.శ్రీకాంత్, డా.శాలిని చెప్పారు. రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో ఆదివారం వారు పర్యటించారు. వ్యవసాయ సమాచారం పొందడానికి కిసాన్ సారథి పోర్టల్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్ వరి, పత్తి పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. రైతులు మంచి దిగుబడి కోసం శాస్త్రవేత్తలు, రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా రైతులకు కలిగే లాభాల గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హుస్నాబాద్‌రూరల్/మద్దూరు(హుస్నాబాద్)/దౌల్తాబాద్(దుబ్బాక): బడిబాట కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొని ఆదివారం ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో అందుతున్న బోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫారాలు తదితర సదుపాయాల గురించి వివరించారు.



హుస్నాబాద్‌రూరల్: పోతారంలో నిర్వహించిన బడిబాటలో ఎంఈఓ మనీల, ఉపాధ్యాయులు



మద్దూరు(హుస్నాబాద్): బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఇంటి వద్దనే అడ్మిషన్లు

- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం
- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న



దౌలాపూర్‌లో ప్రిన్సిపాల్ రాజన్న ప్రచారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇళ్ల వద్దకే వెళ్లి విద్యార్థుల అడ్మిషన్లను తీసుకున్నారు. మండలంలోని గొల్లపల్లి, దౌలాపూర్, బిజివెంకటాపూర్, జగదేవ్‌పూర్‌తోపాటు యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని పుట్టగూడెం, కొండేటి చెరువు గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి కళాశాలలో చేరాలంటూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ముందు ఉండాలన్న లక్ష్యంతో ఇంటి వద్దనే అడ్మిషన్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను గుర్తించి తమ కళాశాలలో చేరాలని కోరామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీధర్, మోహన్‌దాస్, సతీశ్ పాల్గొన్నారు.